# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 04-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ గ్రామాలను అభివృద్ధి, అవకాశాల శక్తివంతమైన కేంద్రాలుగా మార్చడం ద్వారా గ్రామీణ భారతదేశాన్ని పరిపుష్టి చేయడం తమ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోడి పేర్కొన్నారు.

❖ దేశానికి అతిముఖ్యమైన నౌకాదళ ప్రాధాన్యత విశాఖపట్టంకు ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

❖ ఉత్పత్తి చేసే, వినియోగించే రాష్ట్రాల మధ్య ధరల వ్యత్యాసాన్ని తగ్గించడానికి రవాణా, నిల్వ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

❖ పరిశోధన, అభివృద్ధిలో మహిళా కేంద్రీకృత కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు.

================================

గ్రామాలను అభివృద్ధి, అవకాశాల శక్తివంతమైన కేంద్రాలుగా మార్చడం ద్వారా గ్రామీణ భారతదేశాన్ని పరిపుష్టి చేయడం తమ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోడి పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని భారత మండపంలో గ్రామీణ్ భారత్ మహోత్సవ్ ను ఈ రోజు ప్రధానమంత్రి ప్రారంభించి ప్రసంగించారు. తమ ప్రభుత్వ ఉద్దేశాలు, విధానాలు, నిర్ణయాలు గ్రామీణ భారతాన్ని కొత్త శక్తితో నింపుతున్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాలు స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు ఇప్పటివరకు 3 లక్షల కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందించామని తెలిపారు. లక్షలాది గ్రామాల్లోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు చేరుతోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం డిజిటల్ టెక్నాలజీ సాయంతో దేశంలోని అత్యుత్తమ వైద్యులను, ఆసుపత్రులను గ్రామాలకు అనుసంధానం చేసిందని నరేంద్రమోదీ వెల్లడిస్తూ..

(వాయిస్ 31 సెకన్లు)

================================

దేశానికి అతి ముఖ్యమైన నౌకాదళ ప్రధాన కేంద్ర ప్రాధాన్యత విశాఖపట్నంకు  ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ రోజు విశాఖలోని ఆర్కే బీచ్‌లో “నేవీ డే” కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయి ప్రసంగించారు. చిన్న నేవల్ బేస్‌గా ఉన్న ఈస్టర్న్ నేవల్ కమాండ్ నేడు మహోన్నత స్థానానికి చేరిందని కొనియాడారు. విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా గుర్తింపు పొందిందని పేర్కొంటూ..

(వాయిస్ 35 సెకన్లు)

=================================

దేశ పౌరుల భద్రత కోసం అనేక నగరాల్లో సిసి కెమెరాలతో పాటు ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేశామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఈ రోజు ఢిల్లీలోని లక్ష్మీబాయి నగర్ లో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ “సుష్మా భవన్”ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో భద్రతా చర్యలను బహుళార్ధసాధక ప్రాజెక్టులకు ఉపయోగిస్తామని ఆయన తెలిపారు. జాతీయ సుందర నగరాల మిషన్ కింద సమీప గ్రామాలను నగరాలుగా మారుస్తున్నట్లు అమిత్ షా తెలిపారు.

=================================

ఉత్పత్తి చేసే, వినియోగించే రాష్ట్రాల మధ్య ధరల వ్యత్యాసాన్ని తగ్గించడానికి రవాణా, నిల్వ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వ్యవసాయ మంత్రులతో ఈ రోజు ఢిల్లీలో జరిగిన సమీక్షా సమావేశంలో శివరాజ్ సింగ్ మాట్లాడుతూ... ఈ సంవత్సరం వ్యవసాయ రంగం, అనుబంధ రంగాల వృద్ధిరేటు 3.5 శాతం నుంచి 4 శాతం మధ్య ఉండవచ్చని అన్నారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద 11 కోట్ల మంది రైతులకు 18 విడతల్లో సుమారు 3 లక్షల 46 వేల కోట్ల రూపాయలను పంపిణీ చేశామని వెల్లడించారు. నియంత్రిత రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూమికి నష్టం వాటిల్లుతుందని, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేందుకు మరో ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు.

విరామం

=================================

సీనియర్ శాస్త్రవేత్త, భారత అణు కార్యక్రమాన్ని రూపొందించిన కీలక రూపకర్తల్లో ఒకరైన డాక్టర్ రాజగోపాల చిదంబరం ఈ రోజు  తెల్లవారుజామున ముంబైలోని ఓ ఆసుపత్రిలో కన్నుమూశారు. 88 సంవత్సరాల ఆయన చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. భారత అణ్వాయుధ కార్యక్రమాన్ని రూపొందించడంలో డాక్టర్ చిదంబరం కీలక పాత్ర పోషించారు. 1974లో భారతదేశం మొదటి అణు పరీక్ష, అలాగే 1998లో పోఖ్రాన్-2 పరీక్షలు భారతదేశాన్ని అణు శక్తిగా స్థాపించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్, భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్, అటామిక్ ఎనర్జీ కమిషన్ ఛైర్పర్సన్ సహా పలు కీలక శాస్త్రీయ, వ్యూహాత్మక పదవులను ఆయన నిర్వహించారు. 1975లో పద్మశ్రీ, 1999లో పద్మవిభూషణ్ పురస్కారాలతో సత్కరించారు. రాజగోపాల్ చిదంబరం మృతిపట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. భారత అణు కార్యక్రమ రూపకర్తల్లో ఈ శాస్త్రవేత్త ఒకరని, ఆయన కృషి రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకమని సామాజిక మాధ్యమ వేదికగా నరేంద్రమోదీ పేర్కొన్నారు.

=================================

పరిశోధన, అభివృద్ధిలో మహిళా కేంద్రీకృత కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు. శాస్త్రీయ, పరిశ్రమల విభాగం 40వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ రోజు ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. పరిశ్రమలతో పరిశోధన, అభివృద్ధిని సమన్వయం చేసే

లక్ష్యంతో ఈ విభాగం ఏర్పాటు చేశామన్నారు. సాంకేతిక అభివృద్ధి, బదిలీ వినియోగంపై దృష్టి పెడుతూ... స్వదేశీ పారిశ్రామిక పరిశోధనను ప్రోత్సహించడం ఈ విభాగం ముఖ్యమైన విధి అని పేర్కొన్నారు.

================================

విద్యా మౌలిక సదుపాయాల పురోగతికి నిధులను పెంచే యోచనలో ప్రభుత్వం ఉందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. ఈ రోజు ఢిల్లీ విశ్వవిద్యాలయంలో "సమర్పణ్ సమరోహ్"ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాన్ సశక్తి బేటీ, ఈ-దృష్టి ప్రాజెక్టుల కింద అనాథ, సింగిల్ పేరెంట్ మహిళలతో పాటు అంధ విద్యార్థులకు ల్యాప్ టాప్ లు, టాబ్లెట్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... విద్యార్థుల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి ఢిల్లీ విశ్వవిద్యాలయం కోరుకున్న గమ్యస్థానమని ఉద్ఘాటించారు. రాబోయే సంవత్సరాల్లో విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ఈ విశ్వవిద్యాలయం సహాయపడుతుందని ఆయన పేర్కొన్నారు.

================================

జమ్ముకశ్మీర్ లోని వివిధ ప్రాంతాల్లో రేపు, సోమవారం భారీ వర్షాలు, హిమపాతం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ఈ రోజు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కశ్మీర్ లోయ, పరిసర ప్రాంతాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉందని, పలు ప్రాంతాల్లో సున్నా కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని తెలిపింది. అదే విధంగా హిమపాతం కురుస్తుందనే అంచనాతో శ్రీనగర్-జమ్మూ జాతీయ రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. బారాముల్లా, బందిపోరా, కుప్వారా, గండేర్బల్, అనంతనాగ్, కుల్గాం జిల్లాల్లోని హైవేలోని పర్వత ప్రాంతాలు, ప్రధాన రహదారులపై మంచు హిమపాతాలు, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొంది.

================================

38వ జాతీయ క్రీడల జ్యోతి 'తేజస్విని' ఈ రోజు ఉత్తరాఖండ్ లోని బాగేశ్వర్ కు చేరుకోగా జిల్లా క్రీడా అధికారులు, క్రీడాభిమానులు స్వాగతం పలికారు. ఈ నెలాఖరులో ఉత్తరాఖండ్ తొలిసారిగా ఈ కార్యక్రమానికి ఆతిథ్యమిస్తోంది. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి 2024 డిసెంబర్ 26న హల్ద్వానీ నుండి క్రీడల టార్చ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఇది 13 జిల్లాల్లోని 99 ప్రదేశాలను సందర్శించి జనవరి 25న డెహ్రాడూన్ చేరుకుంటుంది.

================================

న్యూజిలాండ్ ఆక్లాండ్ వేదికగా ఈ రోజు జరిగిన టెన్నిస్ ఏఎస్బీ క్లాసిక్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ క్వాలిఫయర్ లో భారత్ కు చెందిన సుమిత్ నాగల్ 1-6, 6-3, 6-1తో న్యూజిలాండ్ ఆటగాడు అలెగ్జాండర్ క్లింట్చరోవ్ పై విజయం సాధించారు. రేపు జరిగే ఫైనల్ క్వాలిఫయింగ్ రౌండ్ లో ఫ్రాన్స్ కు చెందిన అడ్రియన్ మన్నారినో తలపడనున్నారు.

================================

బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియా - భారత్ జట్ల మధ్య సిడ్నీ 5వ టెస్టులో రెండవ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. క్రీజ్‌లో రవీంద్ర జడేజా 8 పరుగులు, వాషింగ్టన్ సుందర్ 6 పరుగులతో ఉన్నారు. ప్రస్తుతం భారత్ 145 పరుగుల ఆధిక్యంలో ఉంది. కాగా మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 185 పరుగులు చేయగా.. ఆసీస్ 181 పరుగులకు ఆలౌటైంది.

================================

================================